ప్రజాశక్తి
సోమవారం 28 నవంబర్ 2022
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# పోలీసు ఉదాసీనత

- నర్సీపట్నంలో అసాంఘిక కార్యకలాపాలు
- మొన్న బాలికల వసతి గృహంలో ఆకతాయిల హల్‌చల్
- నిన్న కల్యాణ్ లాడ్జిలో వ్యభిచార వ్యవహారం
- తాజాగా బ్రాహ్మణ వీధిలోని అద్దె ఇంట్లో బయటపడ్డ గంజాయి, కండోమ్ ప్యాకెట్లు
- వ్యాపారి వెలగ నారాయణరావుపై స్థానికుల ఫిర్యాదు



తాజాగా ఓ ఇంట్లో బయటపడ్డ గంజాయి, కండోమ్ ప్యాకెట్లు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్ విలేకరి**

ఏజెన్సీకి ముఖద్వారమైన నర్సీపట్నం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వుంది. కొంతకాలం రంగురాళ్ల వ్యాపారాలకు, ఇప్పుడు గంజాయి వ్యాపారులకు ఇదొక కేంద్రంగా తయారైంది. పాడేరు ఏజెన్సీలో పండిన గంజాయి రవాణాకు మూలాలన్నీ ఇక్కడే ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. గంజాయి రవాణాకే ఇప్పుడిది పరిమితంకాలేదు. అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. నర్సీపట్నం మున్సిపాల్టీ 24వ వార్డులోని బ్రాహ్మణవీధిలో వెలగ నారాయణరావుకు చెందిన ఇంట్లో అద్దెకు వుంటున్న యువకులు శనివారం రాత్రి సృష్టించిన బీభత్సంతో ఇది వెలుగులోకి వచ్చింది. స్థానికులు పోలీసు స్టేషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో... కొన్ని సంవత్సరాలుగా నారాయణరావు అద్దెకు ఇచ్చిన ఇంట్లో ఇల్లీగల్ యాక్టివిటీస్ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది కుర్రోళ్లు జంటజంటలుగా అమ్మాయిలను తీసు కొస్తున్నట్టు తెలిపారు. రాళ్లకు చుట్టిన కండోమ్‌లు, మద్యం సీసాలను మేడ పై నుంచి విసిరేవారని పేర్కొన్నారు. మహిళలు ఇదే విషయాన్ని ఇంటి యజమాని నారాయణరావు దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఫిర్యాదులో వివరించారు. శనివారం రాత్రి మేడపై నుంచి రాళ్లకు చుట్టిన కండోమ్‌లు కిందపడటంతో కొంతమంది మహిళలు అడుగుదామని వెళ్లే సరికి వారంతా తమ బ్యాగులు పట్టుకొని పారిపోయారు. ఈ విషయం కౌన్సిలర్ మధు ద్వారా పోలీసులకు సమాచారమివ్వడంతో వారొచ్చి తలుపులు తీసి చూడగా గదుల్లో సిగరెట్ ముక్కలు, కండోమ్ ప్యాకెట్లు, గంజాయి వున్నాయి. అద్దెకు వున్న యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయం ఇంటి యజమాని నారాయణావుకు దృష్టికి తీసుకెళ్లినా, ఆయన వారిని ఖాళీ చేయించకపోవడం, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆయనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులు చిత్తశుద్ధితో లోతైన విచారణ చేపడితే నారాయణరావుకు, అద్దెకు వుంటున్న యువతకు వున్న సంబంధాలు బయటపడతాయన్న అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. వ్యాపారైన నారాయణరావుకు మిగతా 2లో..



ప్రమాదంలో మృతిచెందిన వారు వీరే...

## కారు ఢీకొని ముగ్గురు దుర్మరణం

- రేగుపాలెం జంక్షన్ వద్ద దారుణం

వార్త మెయిన్‌లో..

## రాప్తాడు ఎమ్మెల్యేకు నిరసన సెగ

- టిడిపి నేతలు అరెస్టు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే దోపుతుర్తి ప్రకాష్ రెడ్డికి టిడిపి కార్యకర్తల నుంచి నిరసన సెగ తగిలింది. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ విషయం తెలియడంతో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి డౌన్ డౌన్, సిఎం జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందడంతో టూ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వచ్చారని తెలియడంతో కారులో తప్పించుకు పోవడానికి ప్రయత్నించిన టిడిపి కార్యకర్తలు ఐదుగురిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## 'మాధవ' సమాజం కృషి అభినందనీయం

వార్త 4లో..

## 28వ రోజుకు నేవల్ బేస్ నిర్వాసితుల ఆందోళన

వార్త 5లో..

## ఆర్‌టిసిలో అద్దె బస్సుల విధానం వద్దు

వార్త 2లో..



కూర్మన్నపాలెం వద్ద దీక్షల్లో కూర్చున్న మహిళలు

## 'ఉక్కు'ను కాపాడుకుంటాం

654వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

వార్త మెయిన్‌లో..

# దశలవారీగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- జివిఎంసి పరిధిలో లబ్ధిదారులు 1.43 లక్షలు, లే అవుట్లు 34
- ఎంఎస్‌ఎంఇలుగా మహిళా అభ్యున్నతికి ప్రణాళిక
- టిడ్కో ఇళ్లు 24,152, ఇప్పటికే 700 మందికి ఇంటి తాళాలు
- అనర్హుల డిడిలు రూ.26 కోట్లును వెనక్కి ఇచ్చేస్తున్నాం
- 'ప్రజాశక్తి'తో జివిఎంసి యుసిడి పీడీ కెవి.పాపునాయుడు




**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

జివిఎంసి పరిధిలో అర్హులైన పేదలు, సామాన్య ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను అధికారులు వేగవంతం చేసినట్టు జివిఎంసి యుసిడి ప్రాజెక్టు డైరెక్టర్ కెవి.పాపునాయుడు తెలిపారు. ఇప్పటికే మహిళా స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా చర్యలను ప్రారంభించామన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**నగరంలో ఎంతమంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేశారు ? ఎంతమందికి జివిఎంసి మంజూరు చేసింది ?**

లక్షా 83 వేల దరఖాస్తులు మాకు వచ్చాయి. ఒకటో దశలో 1.24 లక్షల పైచిలుకు మందికి ఇచ్చాం. రెండో దశలో 17 వేల పైచిలుకు ఇళ్ల స్థలాలు





మంజూరు చేస్తున్నాం. ఎపి టిడ్కోలో కూడా పిఎంఎవైలో మ్యాపింగ్ కాని మూడు వేల మందికి త్వరలో ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నాం. జివిఎంసి పరిధిలో 34 లే అవుట్లు ఉన్నాయి.

**మొత్తంగా ఎపి టిడ్కో ద్వారా ఎన్ని ఇళ్లను జివిఎంసి పరిధిలో మంజూరు చేశారు ?**

మొత్తం 24,152 ఇళ్లు కాగా వీటిలో 300 చదరపు అడుగులువి 5777, 365, 430 చదరపు అడుగులువి 18,900 ఇళ్లు నిర్మించి మిగతా 2లో..

# ఆర్‌టిసిలో అద్దె బస్సుల విధానం వద్దు

### ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఆర్‌టిసిలో అద్దె బస్సుల విధానాన్ని పూర్తిగా రద్దు చేసి సంస్థ తరుపున సొంత బస్సులు నడపాలని ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా పదో మహాసభలు ఆదివారం జివిఎంసి కార్యాలయానికి ఎదురుగా ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్ యూనియన్ కార్యాలయంలో జరిగాయి. సభలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ వారికి ఎటువంటి సంక్షేమ పథకాలూ అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆర్థిక అంశాలు పరిష్కారం కాలేదన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2017 నుంచి ఆర్‌టిసి కార్మికులకు ఉన్న బకాయిలను, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను రద్దు చేయాలన్నారు. పాత పద్ధతిలోనే రిఫెరల్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 15, 16 తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరగనున్నాయని, ఆ సభలను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.సీతాలక్ష్మి, రీజియన్ అధ్యక్షులు పిఎస్.నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.చిన్నప్పుడు, సిహెచ్.నారాయణ, కెజిపి.రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వి.తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుందరయ్య

# ఫ్యాక్షన్ వ్యవహారాలకు టిడిపి ప్రయత్నం

### వైసిపి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** అనంతపురం జిల్లాలో మరోసారి ఫ్యాక్షన్ వ్యవహారాలకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని ఆ జిల్లాకు చెందిన రాప్తాడు వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే వైసిపి కార్యకర్తలపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. టిడిపి నాయకులు పరిటాల రవి ప్రయివేటు సైన్యం చేసిన అకృత్యాలు అప్పుడు చంద్రబాబు నాయుడుకు కనిపించలేదా ? అని ప్రశ్నించారు. అప్పట్లో టిడిపి మాజీ నాయకులపై కూడా పరిటాల రవి బాంబుల దాడులు జరిపిస్తే చంద్రబాబు నాయుడు అడ్డుకోలేదని తెలిపారు. తన సోదరుడును హత్య చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన తండ్రి ఆరోగ్యం బాగోలేక తమ కుటుంబం శోకంలో ఉండగా రాప్తాడు ఎమ్మెల్యే కనిపించడం లేదని టిడిపి నాయకులు ప్రచారం చేయడం శోచనీయమన్నారు. టిడిపి నేతలు చేస్తున్న ప్రచారానికి మదనపడి తన సోదరుడు వారిపై ఆరోపణలు చేశారని, అయితే ఆయన వాడిన భాష సరైనది కాదని అన్నారు. ఆవేదనలో మాట్లాడారని, అందులో వాస్తవాలు ఉన్నాయనే విషయాలను గుర్తించాలని తెలిపారు. పరిటాల శ్రీరామ్‌ను హత్య చేస్తారన్న బెదిరింపులు వెనుక చంద్రబాబు, లోకేష్ ఉన్నారని ఆరోపించారు. మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించింది వైసిపి ప్రభుత్వమేనన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తావులేదన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ పాల్గొన్నారు.

# పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలి

### బివిఎఫ్, మానవతా సంస్థల సదస్సులో వక్తలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** బాల వికాస్ ఫౌండేషన్, మానవతా స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మైండ్‌ఫుల్ పారెంటింగ్ అంశంపై విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించాయి. ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించారు. మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అర్.సుదర్శనరావు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పాల్గొన్నారు. నేడు బాలలు, పెద్దలు మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని తెలిపారు. టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. పిల్లల జీవన నైపుణ్య వికాస నిపుణులు పయాజ్ మాట్లాడుతూ పిల్లలు తమ సమయాన్ని అర్థవంతంగా, సృజనాత్మకంగా వినియోగించుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. వారి నడవడికపై దృష్టి సారించాలన్నారు. పిల్లలపై ఒత్తిడి పెంచరాదని తెలిపారు. సమావేశంలో ఆచార్య పరమేశ్వరరావు, రామకృష్ణ, ఈదర రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు పయాజ్ సమాధానాలిచ్చారు. ఇటువంటి సదస్సులతో మేలని పలువురు చెప్పుకొచ్చారు.



సదస్సులో పాల్గొన్న నరవ ప్రకాశరావు, బాలమోహన్‌దాస్, సుదర్శనరావు

## స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై ఎఐవైఎఫ్ నిరసన

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ వై.రాంబాబు మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో, కమ్యూనిస్టులు, ప్రజల ఉద్యమాలతో విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా విశాఖపట్నంలో ఉధృత ఉద్యమాలు సాగుతున్నాయన్నారు. ప్రజల మనోభావాలను లెక్క చేయకుండా నాలుగు రోజుల క్రితం అదానీ సంస్థ డైరెక్టర్లు స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించడానికి రావడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థల స్థాపనలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల పాత్ర ఎంత ఉందో పార్లమెంటు సాక్షిగా ప్రధాని చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడమే ధ్యేయంగా మోడీ సర్కారు పని చేస్తోందన్నారు. ప్రయివేటీకరణ చర్యలను అడ్డుకుంటామని తేల్చిచెప్పారు.

## పుస్తక మహోత్సవంలో దేశభక్తి గీతాలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** టర్నర్ చౌల్ట్రీలో నిర్వహిస్తున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు ఆలపించారు. శ్రీ సాయి కళానికేతన్ బృందం వారిచే చక్కని నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడారు. కుల, మతతత్వాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన నిలిచి, రైతులు, కార్మికులు, మహిళలు, ఉద్యోగుల హక్కులపై ప్రజానాట్యమండలి నిరంతరం పాటలు, నాటికలు, నృత్యాలు ప్రదర్శిస్తూ అనేక కళారూపాలను తయారుచేసి ప్రజల్లోకి తీసుకువెళ్తోందన్నారు. కార్యక్రమంలో అరసం కార్యదర్శి అప్పలరాజు, సమన్వయకర్త బి.గోవర్ధన్, శ్రీ సాయి కళానికేతన్ నిర్వాహకులు రాగిణి, ఎన్‌వి.రమణ, ఎన్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

### మొదటి పేజీ తరువాయి..

## పోలీసు ఉదాసీనత

వున్న పలుకుబడితో ఇంతకాలం తాను అద్దెకిచ్చిన ఇంట్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులకు తెలిసినా వారు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల నిర్లక్ష్యమే ఈ తరహా కార్యకలాపాలు పెరగడానికి దారితీస్తున్నాయన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22న అర్ధరాత్రి వేములపూడి ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో నిద్రిస్తున్న బాలికల గదుల్లోకి వెళ్లి అల్లరి చేసిన యువకులపై సరైన చర్యలు తీసుకోలేదు. కొంతమంది యువకులు ప్రహరీ దూకి వసతి గృహంలోపల గదిలోకి వెళ్లి ఓ అమ్మాయి కాళ్లుపట్టుకొని లాగిన విషయం వెలుగులోకి రాకుండా చూశారు తప్ప ఆకతాయిలను పట్టుకోవడానికి ఆనాడు గట్టి ప్రయత్నం చేయలేదు. నర్సీపట్నంలోని శ్రీకళ్యాణ్ లాడ్జిలో వ్యభిచార రాకెట్ నడుపుతున్న కాకినాడకు చెందిన మహిళకు బిజెపికి చెందిన ఎర్రినాయుడు సహకరిస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. కొల్‌కతా, బీహార్, ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చినట్లు అప్పుడు దుమారం రేగింది. లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, కండోమ్‌లు లాడ్జి నుంచి బయటవేస్తున్నారని స్థానిక మహిళలు సమాచారమిచ్చిన తరువాతే పోలీసులు దాడులు నిర్వహించారు. స్మార్ట్ విలేజ్ క్లస్టర్ ఎగ్జిక్యూటివ్, క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి వందల కోట్లు వసూలు నర్సీపట్నం కేంద్రంగా జరిగింది.

### పోలీసుల నిర్లక్ష్యంపై విమర్శలు

అసాంఘిక, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలను నియంత్రించే చర్యలు పోలీసులు తీసుకోవడంలేదన్న విమర్శ ప్రజల నుంచి బలంగా వినిపిస్తోంది. అద్దె ఇళ్లల్లో, లాడ్జిల్లో గంజాయి వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి మకాంవేసి వ్యాపారాలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాపారుల పట్ల పోలీసులు ఉదాసీనంగా వుండడంతో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## దశలవారీగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఇస్తున్నాం. 6280 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌ను కూడా పూర్తిచేశాం. తొలివిడతలో భాగంగా 710 మందికి ఇంటి తాళాలు అప్పగించాం. ఈ నెలాఖరుకు 1300 మందికి ఇంటి తాళాలు అందజేస్తాం.

**ఇళ్లకు వేల సంఖ్యలో అనర్హులుగా గుర్తించారు ? వారి సంగతేమిటి ?**

12800 మందిని విశాఖ జిల్లా (జివిఎంసి) పరిధిలో గుర్తించడం జరిగింది. వీరికి డిడిలను తిరిగి ఎవరికి వారికి వెనక్కి ఇచ్చేసే ప్రక్రియ ప్రారంభించాం. మొత్తం రూ.26 కోట్లు వీరికి చెల్లించాల్సి ఉంది. గతంలో జరిగిన పొరపాటుతో అనర్హులను ఎంపిక చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది.

**జివిఎంసి పరిధిలో మహిళా సంఘాలు ఎన్ని ఉన్నాయి ? వారికి లబ్ధి ఎలా ?**

జివిఎంసి పరిధిలో 33 వేల గ్రూపులున్నాయి. వీటిలో 3.30 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఎంఎస్‌ఎంఇ కింద 25 గ్రూపులను ఎంపిక చేశాం. స్వయం సహాయక సంఘాలను ఎంఎస్‌ఎంఇలుగా మార్చేందుకు దోహదపడే ప్రణాళిక రూపొందించాం.



సాయిపద్మకు కారు తాళం అందిస్తున్న వరుణ్ మారుతీ నిర్వాహకులు

## విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక రాయితీపై కారు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక రాయితీపై వరుణ్ మారుతీ సంస్థ కారును అందిస్తోంది. దీనిలో భాగంగా వికలాంగుల హక్కులు, సాధికారత కోసం కృషి చేస్తున్న గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపకురాలు సాయి పద్మ సిరిపురం వరుణ్ మారుతి సంస్థ ద్వారా వికలాంగులకు ఇచ్చే ప్రత్యేక రాయితీలో వేగన్ ఆర్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కారును కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ సెంట్రల్ గవర్నమెంట్ వికలాంగులు ప్రత్యేకంగా కారు లేదా ఏదైనా నాలుగు చక్రాల వాహనం కొనుక్కుంటే లైఫ్ ట్యాక్స్‌లో పూర్తి రాయితీ, జిఎస్‌టిలో పది శాతం రాయితీ అందిస్తోందన్నారు. ఒక శాతం సెస్ కట్టనవసరం లేదన్నారు. కారు కొనుగోలుకు తనకు మారుతీ సంస్థ పూర్తి సహకారం అందించిందని తెలిపారు. వరుణ్ మారుతీ సంస్థతో కలిసి గ్లోబల్ ఎయిడ్ త్వరలో ఈ విషయాలపై వర్క్‌షాప్ నిర్వహించనుందన్నారు. కార్యక్రమంలో వరుణ్ మారుతి సిజిఎం అబ్బాస్, బ్రాంచ్ హెడ్ నవీన్ పాల్గొన్నారు.

## బాక్సింగ్ ఛాంపియన్ విశాఖ

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్ :** రాష్ట్ర ఆరో సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో 13 కేటగిరీల్లో ఉత్తమ ప్రదర్శనతోపాటు అధికంగా మెడల్స్ సాధించిన విశాఖపట్నం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా విజయనగరం బాక్సర్లు నిలిచారు. జిల్లాకు చెందిన ఎన్.అజయ్ వర్మకు బెస్ట్ బాక్సర్ అవార్డు లభించింది. విజేతలకు బాక్సింగ్‌లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథ కుమార్, అసోసియేషన్ నాయకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రోత్సహిస్తే పతకాలు సాధిస్తా

## కబడ్డీ, రెజ్లింగ్ ప్లేయర్ కవిత

**ప్రజాశక్తి -ఆనందపురం :** తనను ప్రోత్సహిస్తే క్రీడల్లో జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తానని కబడ్డీ, రెజ్లింగ్ ప్లేయర్ గుసిడి కవిత తెలిపారు. ఆనందపురం మండలం, సిర్లపాలెం గ్రామానికి చెందిన గుసిడి అప్పలరాజు, నర్సియమ్మ దంపతుల కుమార్తె గుసిడి కవిత (20) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. చిన్నతనం నుంచి ఆటల పోటీల్లో చురుకుగా పాల్గొనేది. పాఠశాల స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, రెజ్లింగ్ తదితర పోటీలలో చురుకుగా పాల్గొని బహుమతులు తెస్తుండేది. ఈ క్రమంలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు తీసుకొచ్చేది.


కవిత


కవిత సాధించిన పతకాలు

ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొని నాలుగు పతకాలు సాధించింది. చెన్నై, కర్ణాటక, బీహార్, హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఆరు ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులు గెలుచుకుంది. కర్నూలులో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి వెండి పట్టీలు గెలుచుకుంది. 2021 విజయనగరంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు 50 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది.

తండ్రి గుసిడి అప్పలరాజు స్థానిక పూల మార్కెట్‌లో దొండకాయలు వ్యాపారం చేస్తుంటారు. తల్లి నరసమ్మ వ్యవసాయ పనులు చేస్తుంటారు. అన్నయ్య భాను ప్రసాద్ డిగ్రీ చదువుతున్నారు.


కవిత సాధించిన అవార్డులు

### పిన్నిస్ఫూర్తితో క్రీడలపై ఆసక్తి

కవిత పిన్ని చందక ఝాన్సీ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించారు. ప్రస్తుతం ఆమె గ్రామ కార్యదర్శిగా ఉద్యోగం చేస్తున్నారు. తన పిన్ని స్ఫూర్తితోనే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్నానని కవిత చెబుతున్నారు. అమ్మమ్మ స్వగ్రామమైన వేములవలసలో ఉంటూ ఆనందపురం హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో రోజూ ప్రాక్టీస్ చేస్తోంది.

## నేరాలు ఘోరాలు

### ఉద్యోగాల పేరుతో మోసం

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఓ మహిళపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్ రాజు కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బలివాడ పద్మ విశాఖ, శ్రీకాకుళం జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువకుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసి పరారైంది. విశాఖలోని ఆరిలోవ హెల్త్ సిటీలో గల ఒక ప్రయివేటు హోటల్లో ఉన్నట్టు బాధితులు గుర్తించి ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ఈ కేసు వివరాలను పరిశీలించి శ్రీకాకుళం పోలీసులకు అప్పగించారు. ఆరిలోవకు చెందిన యువకుడు పల్లీ ఉద్యోగం కోసం ఆమెకు డబ్బులు చెల్లించి మోసపోయినట్టు ఇటీవల ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నాలుగు రోజుల క్రితం ఆమెపై కేసు నమోదు చేశారు. నగరంలో పలువురు నిరుద్యోగుల నుంచి సుమారు రూ.56 లక్షలు ఆమె వసూలు చేసినట్టు తెలిసిందని సిఐ తెలిపారు.

### హైస్కూల్‌లో మోటారు చోరీ

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23వ తేదీన రూ.36 వేలు విలువైన 1.5హెచ్‌పి సామర్థ్యం గల మోటారు చోరీకి గురైనట్లు ప్రధానోపాధ్యాయులు రేఖ అప్పారావు ఆదివారం తెలిపారు. నాడు, నేడు పనులు జరుగుతున్న పని ప్రదేశంలో చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఇటుక, ఇసుక, మెటల్ తరచూ చోరీకి గురవుతున్నట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## 'నిరంతర సాధన అవసరం'

**ప్రజాశక్తి -తగరపువలస :** నిరంతర సాధన ద్వారానే లక్ష్యాన్ని చేరుకోవచ్చని భీమిలి ఎస్ఐ గంటా హరీష్ విద్యార్థులకు సూచించారు. చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణా తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నింటికీ మించి సమయ పాలన, క్రమశిక్షణ అవసరమని నొక్కి చెప్పారు. వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఉచిత శిక్షణ ఇస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**ప్రజాశక్తి -పిఎం పాలెం :** పాలకొండలోని ఎల్‌విజిజె పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థులు శిల్పారామం వేదికగా కలుసుకున్నారు. 1981-82లో ఎస్ఎస్‌సి, 1982-84లో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు వృత్తి రీత్యా విశాఖలో స్థిర పడ్డారు. వీరంతా ఆదివారం శిల్పారామంలో ఆత్మీక కలయిక ఏర్పాటుచేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. వీరిలో టి.వేణుగోపాల్ విఎంఆర్‌డిఎ సెక్రెటరీగా, కె.శేషు, పి.రాధ ఎండిఒలుగా, పాలకొండ టిడిపి రాష్ట్ర సెక్రెటరీగా అప్పలనాయుడు, మరికొందరు ప్రయివేటు బ్యాంకుల్లో పనిచేస్తున్నట్లు వారు తెలిపారు.

## భీమిలిలో రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక ఎగువపేట శ్రీనూకాలమ్మ ఆలయం వేదిక వద్ద విజయనగరానికి చెందిన ఎస్వీఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి గాడు చిన్ని కుమారి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత ముందుకు వచ్చి ఈ తరహా సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రక్తదాన శిబిరం నిర్వాహకులను అభినందించారు.

## శివాలయానికి సిసి కెమెరాలు

**ప్రజాశక్తి-పద్మనాభం :** మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కుద్రపల్లి గ్రామములో ఉన్న రామచంద్ర రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం సిసి కెమెరాలను ఏర్పాటుచేశారు. రక్షణ ఏర్పట్లలో భాగంగా విశాఖపట్నం దేవాదాయ శాఖ ఆధ్వర్యాన వీటిని ఏర్పాటుచేశారు.

# అభివృద్ధికి నోచని 'పేకేరు'

**ప్రజాశక్తి-ఆనందపురం :** గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏర్పడి ఏడాదిన్నర అయినా పేకేరులో ఎటువంటి అభివృద్ధీ జరగలేదని సర్పంచ్ కర్రి దేవినాయుడుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గమేనుడు సిమెంట్ పని కూడా చేయలేదని తెలిపారు. పంచాయతీలో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ ఉండిపోవడంతో ప్రస్తుతం ఎవరూ రావడం లేదని తెలిపారు. దీంతో నిధులు ఉన్నా పనులు చేయలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. వాలంటరీ వ్యవస్థ వచ్చిన తర్వాత సర్పంచులు ప్రాధాన్యత తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి రావాల్సిన నిధులను సర్పంచ్ ప్రమేయం లేకుండా విద్యుత్ బిల్లుల పేరుతో స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. పేకేరు గ్రామం చివరన కల్వర్టు పనులు చేపట్టినా బిల్లు మంజూరు చేయడంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. పేకేరులో కమ్యూనిటీ హాల్ లేక సమావేశాలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి పెండింగ్ బిల్లులు అందేలా సహకరించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

# ఔత్సాహిక రచయితల శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** వర్తమాన రచయితల సంఘం ఆధ్వర్యాన స్థానిక చిన్న బజారు శ్రీనివాస కల్యాణ మండపంలో ఔత్సాహిక రచయితల శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విశాఖ జోన్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వివిఎస్ బాబ్జీరావు మాట్లాడుతూ, వర్తమాన రచయితల సంఘం ఏర్పాటు అభినందనీయ మన్నారు. ప్రముఖ రచయిత, ప్రభుత్వ రంగ బీమా సంస్థ విశ్రాంత అధికారి డాక్టర్ ఎం.సుగుణారావు, ప్రముఖ రచయిత్రి పి.హైమావతి మాట్లాడుతూ, ఔత్సాహిక రచయితలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్తమాన రచయితల సంఘం నిర్వాహకులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ, స్పందించే హృదయం ఉంటే ఎన్నో రచనలు మన కలం ద్వారా జాలువారుతాయని తెలిపారు. సమాజానికి మంచి సందేశం ఇచ్చే రచనలు అవసరమని స్పష్టం చేశారు. ఓ మంచి కథ సమాజ హితానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సంఘం నిర్వాహకులు బివి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను నిర్వాహకులు సత్కరించారు.



ప్రముఖ రచయిత్రి హైమావతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

# కౌశల్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**ఆనందపురం :** మండలంలోని నేలతేరు కస్తూరిబా గాంధీ విద్యాలయం విద్యార్థులు కౌశల్ క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యాన రామనాథ్ సెకండరీ స్కూల్, ఎన్ఎస్‌టిఎల్‌లో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు పాల్గొన్నాయి. కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు బి.గాయత్రి (8వ తరగతి), బి.శ్రావణ లక్ష్మి (9వ తరగతి), ఎన్.భారతి (10వ తరగతి) టీమ్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపల్ చంద్రకళ, ఉపాధ్యాయులు అభినందించారు.

**పద్మనాభం :** పద్మనాభం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మొకర సిరి జిల్లా స్థాయి కౌశల్ సైన్స్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రత్యేక అధికారి గ్రేష్ లిల్లి తెలిపారు. విద్యార్థిని సిరిని ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



## సింహాచలంలో ట్రాఫిక్ కష్టాలు

**ప్రజాశక్తి-సింహాచలం:** జివిఎంసి 98వ వార్డు పరిధి సింహాచల ప్రాంతంలో నిత్యమూ ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. శని, ఆదివారాల్లో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, విఐపిలతో రద్దీగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు అడవివరం నుంచి గోశాల వరకు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిఆర్‌టిఎస్ రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతుందని స్థానికులు చెబుతున్నారు. సింహాచలం దేవాలయంలో జరిగే అతి ముఖ్యమైన ఉత్సవాల సమయంలోను ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


పంచకర్లకు పసుపుగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

## పంచకర్లకు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- గాజువాక, పెందుర్తి :** వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబుకు ఆ పార్టీ 87వ వార్డు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దామోదర్, దానప్పలు, బండ గోవిందరాజులు, గుంట శ్రీనివాసులు పాల్గొన్నారు.

**పెందుర్తి:** వైసిపి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు ఆ పార్టీ నగర అధికార ప్రతినిధి, హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యతిరాజుల నాగేశ్వరరావు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి కంచిపాటి జగదీష్, కార్యదర్శి చింతాడ సురేష్, సభ్యులు బుజ్జి, సువ్వాడ శ్రీను తదితరులతో కలిసి నగరంలోని ఆయన నివాసంలో పంచకర్లను కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



హాస్యప్రియ కామెడీ క్లబ్ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

## హాస్యప్రియ కామెడీ క్లబ్ పదో వార్షికోత్సవం

**ప్రజాశక్తి-సీతమ్మధార** : హాస్యప్రియ కామెడీ క్లబ్ పదో వార్షికోత్సవాన్ని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ షాపింగ్, హాస్పిటల్, సెల్ సందడి, అసలు ఏం జరిగింది, సర్టిఫికెట్, ఆహూతులను కడుపుబ్బా నవ్వించాయి. అనంతరం హాస్యప్రియ క్రియేషన్స్ నిర్మించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్లాస్టిక్ ఫ్రీ విశాఖ శీర్షికను జివిఎంసి నిర్వహించిన లఘు చిత్రాల పోటీల్లో ఉత్తమ చిత్రంగా ఎంపికైన ప్లాస్టిక్ ప్రేమ లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ, హాస్యాన్ని ఆస్వాదించడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత చేకూరుతుందన్నారు. జివిఎంసి డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ ప్రేమ లఘు చిత్రం అద్భుతంగా ఉందన్నారు. హాస్య కామెడీ క్లబ్ అధ్యక్షులు ఈమంది ఈశ్వరరావు మాట్లాడుతూ, సంస్థ ప్రారంభమై నేటికి పది సంవత్సరాల పూర్తి చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కామెడీ క్లబ్ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, కోరుకొండ రంగారావు, వేముల భాస్కరాచారి, ప్రవీణ్, శేఖర్, సీతారాం, శతపతి, లలిత, గోపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అప్పారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

## పవర్ లిఫ్టర్ అప్పారావుకు సన్మానం

**ప్రజాశక్తి -గాజువాక** : ఇటీవల నేపాల్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన స్టీల్‌ప్లాంట్ ఫోర్‌మ్యాన్ అండిబోయిన అప్పారావును గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భవిష్యత్తులో అప్పారావు మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది లక్ష్మి, సంపంగి ఈశ్వరరావు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవంలో మాట్లాడుతున్న తౌడన్న

## 'సమైక్య'లో రాజ్యాంగ దినోత్సవం

**ప్రజాశక్తి-గాజువాక** : గాజువాకలోని సమైక్య అపార్ట్‌మెంట్‌లో 'రాజ్యాంగ దినోత్సవం' నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అపార్ట్‌మెంట్ కార్యదర్శి ఎ.తవిటయ్య, కోశాధికారి ఎంవి.రమణ, మహిళా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని రాజ్యాంగం ప్రాముఖ్యత వివరిస్తూ మాట్లాడారు. సమావేశంలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఆశవానిపాలెంలో..

## సిసి కెమెరాల ఏర్పాటు

**ప్రజాశక్తి -కంచరపాలెం** : జివిఎంసి 57వ వార్డు పరిధి ఆశవానిపాలెం గ్రామంలో వార్డు కార్పొరేటర్ ముర్రువాని నానాజీ శివదేవి దంపతులు ధన సహాయంతో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలను పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సిఐ ప్రసాదరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకీ శ్యామ్ కుమార్‌రెడ్డి, వార్డు నాయకులు నమ్మి శ్రీనివాస్, గ్రామ పెద్దలు అవతారం, గోవిందు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

# 64 కళలకు ప్రతిబింబాలుగా బాలి చిత్రాలు

**ప్రజాశక్తి-సీతమ్మధార** : ప్రముఖ చిత్రకారుడు, రచయిత బాలి గీసిన చిత్రాలు 64 కలలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వపు ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్ కొనియాడారు. చిత్ర కారుడిగా ఆరు దశాబ్దాలు పూర్తి చేసుకున్న బాలిని ఆదివారం పౌర గ్రంథాలయంలో కవులు, కళాకారులు, రచయితలు ఘనంగా సన్మానించి సత్కరించారు. విశాఖ సంస్కృతి సంస్థ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలి కథలన్నీ జీవిత సత్యాలని, కార్టూన్లు హాస్యగుళికలని పేర్కొన్నారు. సమాజానికి అవసరమైన రీతిలో మంచి సందేశం ఇచ్చే విధంగా కార్టూన్లు గీసిన బాలి దేశవ్యాప్తంగా ఎంతో మంది గుండెల్లో అభిమానం సంపాదించుకున్నారన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, నేటితరానికి బాలి ఆదర్శప్రాయుడు అన్నారు. ఆరు దశాబ్దాలుగా ఎన్నో ప్రముఖ పత్రికలు, వార, మాస పత్రికలకు తన చిత్రాల ద్వారా సేవలు అందించడం గర్వ కారణం అన్నారు. విశాఖ సంస్కృతి వ్యవస్థాపకులు సిరాల సన్యాసిరావు మాట్లాడుతూ, బాలి అందించిన లక్షలాది బొమ్మలు, రచనలు తెలుగువారి గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాయన్నారు. తమ సంస్థ ద్వారా బాలిని సత్కరించుకోవడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. విశాఖ రచయతలు సంఘం ప్రతినిధులు మేడ మస్తాన్ రెడ్డి, వి.రామకృష్ణ, అడపా రామకృష్ణ, ద్విభాష్యం రాజేశ్వరరావు, దామెర వెంకట సూర్యారావు, జోగారావు తదితరులు బాలి అందించిన సేవలు కొనియాడారు. పి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

# 'మాధవ' సమాజం కృషి అభినందనీయం

**ప్రజాశక్తి-మాధవధార** : మాధవధార గ్రామ అభివృద్ధికి శ్రీ మాధవ యువజన సమాజం సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. శ్రీ మాధవ యువజన సమాజం సర్వసభ్య సమావేశం ఆదివారం మాధవదారలోని భరద్వాజ క్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వావిలపల్లి ప్రసాద్ హాజరై మాట్లాడారు. శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో త్వరలో నిర్మించనున్న నూతన భవనానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీమాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామగోపాల్‌రావు మాట్లాడుతూ, శ్రీ మాధవ యువజన సమాజం అభివృద్ధిలో భాగంగా త్వరలో ఐదు అంతస్తుల నూతన భవనాన్ని నిర్మించనున్నట్లు తెలియజేశారు. మాధవధార గ్రామ ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ నూతన భవన నిర్మాణం వల్ల మాధవ యువజన సమాజానికి ఆదాయం పెరగడంతోపాటు క్రీడాకారులకు, విద్యార్థులకు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల సూచనలు, సలహాలతో మాధవ యువజన సమాజం విధివిధానాలతో నూతన బైలాను త్వరలో రూపొందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవ యువజన సమాజం సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, గాయత్రి విద్యామందిర్ నిర్వాహకులు సనపల జగదీశ్వరరావు, వావిలపల్లి వెంకటరావు, ప్రముఖ న్యాయవాది సనపల కరుణ, పేడాడ పాండురంగారావు, నంబాల అశోక్‌బాబు, బొడ్డేపల్లి త్రినాధస్వామి, పైడి వెంకటరమణ, సనపల నారాయణస్వామి, పప్పల శ్రీదేవి, తమ్మినేని పద్మజ, సనపల చిన్న వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసాద్

# 'ఎయు, అటవీ స్థలాలను వైసిపి నేతల కబ్జా'

**ప్రజాశక్తి-సీతమ్మధార** : విశాఖలోని ప్రభుత్వ, క్రిస్టియన్ మైనారిటీ, వివాదాస్పద స్థలాలతో పాటు చివరికి ఎయు, అటవీ శాఖ స్థలాలను కూడా వైసిపి నేతలు కబ్జా చేస్తున్నారని, ఇది మరో భూ కుంభకోణం అని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి సిరిపురం వెళ్లే మార్గంలో అటవీశాఖకు చెందిన భూమిపై కడప జిల్లాకు చెందిన వైసిపి ఉప ముఖ్యనేత కన్నుపడిందని తెలిపారు. చీఫ్ కన్సర్వేటివ్ ఫారెస్ట్ వనవిహార్‌లో బ్లాక్ నెంబర్12 టౌన్ సర్వేనెంబర్ 88లో ప్రైవేటు ఆస్తిగా చూపించి సర్వేచేస్తున్నారని తెలిపారు. సుమారు 3.62 ఎకరాల్లో రూ.350 కోట్లు విలువ చేసే భూమిని కొట్టేస్తున్నారని ఆరోపించారు. ఇది ఎయు, అటవీ శాఖకు చెందిన ప్రభుత్వ భూమన్నారు. ప్రయివేటు ఆస్తి అని చెప్పి అటవీ శాఖ అనుమతి లేకుండా సర్వే చేయిస్తున్నారని, అటవీ శాఖ కానిస్టేబుల్ వారిని అడ్డుకున్నారని తెలిపారు. 1960లో దఖలు పడిందని కడప జిల్లాకి చెందిన ఓ ప్రముఖ వైసిపి నేత ఈ ఫారెస్ట్ ల్యాండ్‌ను సర్వేచేయించారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 18 రోజుల్లో జివిఎంసి సర్వేయర్‌తో సర్వే చేయించారని చెప్పారు. తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేయడానికి కుట్రపన్నారని తెలిపారు. ఐఎఎస్ హోదాలో ఉన్న కమిషనర్ రాజాబాబు, ప్రభుత్వ భూములను కాపాడాల్సింది పోయి, వాటి బాగోతాలను బయటపడితే రిజెండర్ పంపిస్తున్నారని తెలిపారు. భూములు వివాదంలో లేవని కమిషనర్ రిజెండర్ ఇచ్చి ఎలా చెపుతారని, దమ్ముంటే మీడియా సమావేశం ఏర్పాటుచేసి కమిషనర్ చెప్పగలరా అని ప్రశ్నించారు. యాజమాన్యపు హక్కులపై కోర్టు వివాదంలో ఉన్నపుడు ఒకే వ్యక్తి పేరు మీద సిబిసిఎన్‌సి స్థలం టిడిఆర్ ఎలా ఇస్తారన్నారు.

# ప్రజాస్వామ్యానికి మాతృక రాజ్యాంగం

**ప్రజాశక్తి - ములగాడ** : భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి మాతృక వంటిదని సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో రెండు రోజులుగా రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన జరుగుతున్న రాజ్యాంగ శిక్షణా తరగతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సార్వజనీన వయోజన ఓటు హక్కు, బహు పార్టీ వ్యవస్థ, రాజకీయ హక్కులు, సమన్యాయ పాలన, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ, సమిష్టి బాధ్యతతో పనిచేసే మంత్రివర్గం, దేశభక్తి, అంకితభావం గల సైనిక వ్యవస్థ భారత ప్రజాస్వామ్యాన్ని ప్రపంచానికి తలమానికంగా తీర్చిదిద్దుతున్నాయని చెప్పారు. అందుకే భారత ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య మాతృక అంటారని తెలిపారు. రాజనీతి, పాలనా శాస్త్ర అధ్యాపకులు అనసూయాదేవి మాట్లాడుతూ, ప్రజల నిరంతర చైతన్యమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా ఉపయోగించుకోవాలని కోరారు. సరైన నాయకులను ఎన్నుకొని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు రాజ్యాంగంపై వివిధ పోటీలను నిర్వహించారు. వారికి ప్రశంసా పత్రాలను, బహుమతులను అందించారు. నిర్వాహకులను, విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

## సగర చైతన్య యాత్ర

**ప్రజాశక్తి-గాజువాక** : జివిఎంసి 67, 68 వార్డుల పరిధిలోని గుడివాడ అప్పన్న కాలనీలో ఆదివారం సగర చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సగర సంఘం నాయకుడు నూకరాజు మాట్లాడుతూ, సగర సంఘం రిజర్వేషన్ గురించి, పిల్లల రాయితీలు గురించి 1991 నుంచి పోరాటం చేస్తున్నామని తెలిపారు. అయినా నేటికీ ఫలితంలేదన్నారు. సగర యువజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం సగరలను బిసి 'డి' నుంచి బిసి 'ఎ'కు మార్చాలని డిమాండ్ చేస్తూ చైతన్య యాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సగర సంఘం అధ్యక్షులు గుర్రం నూకరాజు, రాష్ట్ర బీసీ సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గండికోట తాతారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి గుర్రం సింహాచలం, కోశాధికారి నక్క పెంటయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు

## ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాశక్తి-గాజువాక:** జివిఎంసి 76వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దొడ్డి రమణ ఆధ్వర్యాన జరగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో సుమారు రూ.75లక్షలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి వైసిపి ప్రభుత్వానికి రెండు కళ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, తాటికొండ జగదీష్, దేనిశెట్టి చిన్నారావు, అండిబోయిన సన్నీ, తాటికొండ అచ్యుత్, ముమ్మిడివరపు నరసింహామూర్తి, గొంప రమేష్, శ్రవణ్ కుమార్, మొలకలపల్లి ప్రసాద్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి రంగా వర్ధంతిని

## వాడవాడలా జరపాలి

**ప్రజాశక్తి-పెందుర్తి** : వంగవీటి రంగా వర్ధంతిని డిసెంబర్ 26న వాడవాడలా చేయాలని 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 97వ వార్డు పరిధి సుజాతనగర్ ఇంద్రాణి కల్యాణ మండపంలో రాధా రంగా ఆర్గనైజేషన్ కమిటీ ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో సుమారు 60 శాతం ఉన్న కాపులు, మిగతా కుల సంఘ నాయకులను కలుపుకొని కాపు కులస్తులను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానాపతి శంకరరావు, పాశర్ల ప్రసాద్, బాలాజీ, నక్క కనకరాజు, పిన్నింటి పార్వతి పాల్గొన్నారు.

# 28వ రోజుకు నేవల్ బేస్ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి : నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యమ జెఎసి ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళన ఆదివారం 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యమ జెఎసి నేతలు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన హామీలన్నీ విస్మరించి, కొత్తపట్నం, వాడ నరసాపురం గ్రామాల మత్స్యకారులను చేపల వేటకు వెళ్లనీయకుండా నేవీ అధికారులు గేట్లు బంధించి ఉపాధిని దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కాలనీ నాయకులు మాట్లాడుతూ నేవల్ బేస్ నిర్మాణంతో ఇళ్లు, భూములు, ఇతర ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులం ఒదరికీ ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీ 17ఏళ్ల పూర్తయినా నేటికీ కార్యరూపం దాల్చకపోవడం దారుణమన్నారు. నేవల్ బేస్ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయిన చిన్న కలవలపల్లి,కొత్తపేట, గోవింద పాలెం, వాడపాలెం గ్రామాల ప్రభావిత ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**సమస్యల్ని పరిష్కరిస్తాం.. ధర్నా విరమించండి : అధికారులు**

ధర్నా శిబిరాన్ని అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ, మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు సందర్శించి ఆందోళనకారులతో



నిర్వాసిత ఆందోళనకారులతో మాట్లాడుతున్న అధికారులు

మాట్లాడారు. నిర్వాసితుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారన్నారు. పెండింగ్ ప్యాకేజీలు చెల్లింపుతోపాటు ప్రభావిత గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, అందరికీ ఉపాధి కల్పన, నేవీ కాంట్రాక్టు పనుల కల్పన, జెఎసి నేతలపై పెట్టిన కేసులను జిల్లా ఎస్‌పితోమాట్లాడి తొలగింపునకు చర్యలు చేపట్టడం పెండింగ్ గంపల ప్యాకేజీ చెల్లింపు వంటి సమస్య పరిష్కారం, సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టేందుకు ప్రభావిత గ్రామాల్లో సోమవారం నుంచే సర్వే నిర్వహిస్తామని భరోసానిచ్చారు. సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు ద్వారా కొంత సమయం పడుతుందని, నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం కృతనిశ్చయంతో ఉందని, ఆందోళనను విరమించాలని కోరారు.

దీనిపై జెఎసి నేతలు స్పందిస్తూ దాదాపు నెలరోజుల పాటు తాము ఆందోళన చేస్తుంటే, డిమాండ్లలో ఒక్కదానినైనా నెరవేర్చేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళనను విరమించి, టెంట్ ఎత్తేయాలని అధికారులు కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్య శాశ్వతంగా పరిష్కారమౌతుందని నమ్మకం కలిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆర్‌డిఒ, ఫిషరీస్ జెడి చెప్పిన మాటలను గౌరవించి, సోమవారం నిర్వహించతలపెట్టిన తహశీల్దార్ కార్యాలయం ముట్టడిఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడునాయుడు, ఎనిమిది గ్రామాల జెఎసి పెద్దలు, వేలాదిమంది నిర్వాసితులు పాల్గొన్నారు.

## అపూర్వ కలయిక




35 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట డిపియన్ స్కూల్‌లో 1988-89 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం మండలంలోని చౌదరి తోటలో జరిగింది. 35ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు, అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఎన్ఎస్ఉపాధ్యాయులు జివి అప్పారావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బి అప్పారావును సత్కరించారు. తమబ్యాచ్ నుంచి దేశ రక్షణ విభాగంలో పనిచేసి కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులను సత్కరించారు. పేద విద్యార్థి చదువు నిమిత్తం రూ.25వేలు నగదు సాయం అందించారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు డిజి.నాథ్, మాజీ వైస్ ఎంపిపి వేగి గోపీకృష్ణ, కొప్పాక భాస్కరరావు, పాలూరి లోవరాజు, ఎవి వీరబ్రహ్మం, యస్ విజయ్‌కుమార్, లాలం శ్రీనివాసరావు, పియన్ భాషా ఖాన్, పాతాళం సత్యనారాయణ పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం పాలనలో చేయలేని అభివృద్ధిని వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసి చూపిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని అక్కిరెడ్డిపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెంలో రూ.12 లక్షలతో అంగన్వాడి భవనం, తారకరామా కాలనీలో 4.33 ఎకరాల్లో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న హైస్కూల్ భవనానికి శంకుస్థాపన చేశారు. దిబ్బపాలెం గ్రామంలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం పనిచేసిందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఇన్ఫోసిస్ వంటి ఐటి దిగ్గజ కంపెనీలను తమ ప్రభుత్వం తీసుకొస్తుంటే, అది తమ ఘనతగా టిడిపి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు బివి సత్యవతి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా అపరిష్కృత సమస్యలను మంత్రి అమర్నాథ్ పరిష్కరిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమం లో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచులు సేనాపతి శాంతి సూరప్పారావు, పీలా ఉష అప్పారావు, డిఇఇ లింగేశ్వర రెడ్డి, తహశీల్దార్ గంగాధర్‌రావు, ఎంపిడిఒ చంద్రశేఖర్, కృష్ణ మోహన్, నారపిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

## బ్రాండిక్స్ కంటి వైద్య శిబిరంలో 471 మంది రోగులకు పరీక్షలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి) సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రాండిక్స్ ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన 95వ కంటి వైద్య శిబిరంలో 471 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరానికి 500మందికి పైగా రోగులు హాజరుకాగా, వారిలో పది మంది చిన్నారులతో సహా 471మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి అద్దాలు అవసరమైన 332మందికి బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరైస్వామి స్వయంగా కళ్లద్దాలను అందజేశారు. 47మందికి కాటరాక్ట్, మరో ఐదుగురికి ఇతర కంటి ఆపరేషన్లు ఇతర కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు సూచించారు. మిగిలిన వారిని వచ్చేవారం నిర్వహించే 96వ శిబిరానికి రావాలని టోకెన్లు



రోగులకు కళ్లద్దాలు అందిస్తున్న బ్రాండిక్స్ దొరైస్వామి

అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు మజ్జిగ, ఫలహారాలు, భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ పార్టనర్ దొరైస్వామి మాట్లాడుతూ, తమ సంస్థ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి



అందరికోసం ఎన్‌టిఆర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధ

ప్రజాశక్తి-.అనకాపల్లి : తెలుగు ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ఎన్‌టిఆర్ అభిమాన సంఘం డిమాండ్ చేశారు ఆదివారం. సత్యనారాయణపురం ప్రాంగణంలో అనకాపల్లి ప్రాంత సీనియర్ ఎన్‌టిఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో ముఖ్యఅతిథి టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ మాట్లాడుతూ, తెలుగుజాతికి ప్రపంచ గుర్తింపు తీసుకొచ్చిన ఎన్‌టిఆర్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, సంక్షేమానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. నీతి నిజాయితీలకు మారుపేరైన ఎన్‌టిఆర్‌కు ఏ రూపంలో అవమానం జరిగినా సహించేది లేదని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్న ఎన్‌టిఆర్ పేరును మార్చడం, ఎన్‌టిఆర్ విగ్రహాలను తొలగించడానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అభిమాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేదుల రామారావు, పల్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో లంక నాగేంద్రరావు రచించిన 'అందరి కోసం ఎన్‌టిఆర్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కడిమిశెట్టి నరసింగరావు, సినీ ఎగ్జిబిటర్ మల్ల వెంకటరావు, పెనుమత్స వెంకటేశ్వరరాజు, వానపల్లి త్రినాథ్, వేల్పుల గణేష్, దాడి భోగలింగం పాల్గొన్నారు.

## ఉచిత తీర్థయాత్రలకు 'ఎంవిఆర్' బస్సులు



తీర్థయాత్ర బస్సులను ప్రారంభిస్తున్న ముత్యాల సతీష్

ప్రజాశక్తి- అనకాపల్లి :ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంవిఆర్ ట్రస్ట్ ద్వారా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పేదలకు తీర్థయాత్రలకు తరలించే కార్యక్రమంలో కొనసాగుతోంది. ఆదివారం అనకాపల్లి ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయం నుంచి బయలుదేరే ఎంవిఆర్ తీర్థయాత్ర బస్సులను ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్తీక మాసంలో పార్లమెంటరీ నియోజకవర్గం పరిధి నుంచి వందలాది మందిని బస్సుల్లో తీర్థయాత్రలకు తీసుకెళ్లి చూపించడం ద్వారా ఎంవిఆర్ ప్రజల మన్ననలు చూరగొన్నారన్నారు. ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన, అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి- చోడవరం/చోడవరం రూరల్: క్రీడలతో ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన యువతతో కూడిన దేశ నిర్మాణం జరుగుతుందని క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాల్, కోశాధికారి సి.హెచ్.ప్రసాదరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అనకాపల్లి జిల్లా క్రీడాభారతి కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం క్రీడాభారతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏటా హనుమాన్ జయంతి, ధ్యాన్‌చంద్ జయంతి, రథ సప్తమి రోజున సూర్య నమస్కారాలు, మహావీర్ ఛత్రపతి శివాజీ తల్లి జిజియా భాయ్ జయంతి, క్రీడా జ్ఞాన పరీక్ష (క్విజ్ పోటీలు) సందర్భాలలో క్రీడలు నిర్వహించి క్రీడాజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి రోజున అన్ని పాఠశాలల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని సూచించారు. ఈనెల 29న, అల్లూరి జిల్లా కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రసాదరాజు తెలిపారు.

## కొండకర్ల ఆవకు పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పర్యాటకులతో కొండకర్ల ఆవలో ఆదివారం సందడిగా మారింది. విశాఖపట్నం, గాజువాక, స్టీల్ ప్లాంట్, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు బస్సులు, వ్యాన్లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై కొండకర్ల ఆవ సందర్శనకు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చారు. కొండకర్ల ఆవ తీరంలోనే టెంట్లు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో కాలక్షేపం చేశారు. అనంతరం తీరంలో ఆవ అందాలను చూపించడానికి సిద్ధంగా ఉన్న ఫైబర్ బోట్లపై విహరించారు. ఆవలో కనువిందు చేసే కలువ పువ్వులు, తామర ఆకులు నీటిలో కనిపించే చేపలు,



ఫైబర్ బోట్లలో విహారానికి వెళుతున్న పర్యాటకులు

వివిధ రకాల పక్షులను చూసి ఆనందంగా గడిపారు. కాగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పర్యాటకులకు తగిన సదుపాయాలు ఆవలో లేకపోవడంపై వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు.

## రైతుల ఖాతాల్లోకి నేడు పంట నష్టపరిహారం

ప్రజాశక్తి- అనకాపల్లి : 2021- 22లో సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ రుణాలతోపాటు, పంట నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం పరిహారాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోమవారం విడుదల చేస్తారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి లీలావతి ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిలో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తే, గుండాల వీధి వార్డు సచివాలయంలో అనకాపల్లి జిల్లా స్థాయి కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## శారదాపీఠంలో బ్రాండిక్స్ దొరైస్వామి



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు పొందుతున్న దొరైస్వామి

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : బ్రాండిక్స్ అపెరల్ ఇండియా పార్టనర్ దొరైస్వామి విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. రాజశ్యామల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులను దర్శించుకున్నారు. బ్రాండిక్స్ కంపెనీని సందర్శించి, కార్మికులకు ఆశీస్సులు అందించాలని శారదాపీఠాధిపతిని ఆహ్వానించారు.

# ఎప్పుడు కూలుతుందో..?

- శిథిల భవనంలో కొప్పాక పశు వైద్యకేంద్రం
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని నేతలు, అధికారులు



కొప్పాక పశు వైద్యకేంద్రం



శిథిలావస్థకు చేరుకుని రంధ్రాలైన గోడలు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : అనకాపల్లి మండలంలో కొండ కొప్పాక గ్రామంలోని పశు వైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. కొప్పాక పరిసర ప్రాంతాల్లో సుమారు 10 గ్రామాలకు ఇదే పశు వైద్య కేంద్రం దిక్కు కావడంతో, రోజూ పదుల సంఖ్యలో తమ పశువులను, పెంపుడు జంతువులను వైద్యం నిమిత్తం తీసుకొస్తుంటారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడల సందుల్లోంచి పాములు భవనంలోకి చేరుతున్నాయంటే ఎంత ప్రమాదకరస్థితిలో ఉందో అర్థమవుతుంది. ఇక్కడ పనిచేస్తున్న పశు వైద్యులతో పాటు, సిబ్బంది శిథిల భవనం ఎప్పుడు కూలుతుందోనని ప్రాణాలను అరచేతిలో పట్టుకుని విధులను నిర్వహిస్తున్నారు. శిథిల భవనం దుస్థితిపై పలుమార్లు ప్రతిపాదనలు పంపినా, అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అలాగే పశు వైద్య కేంద్రం పరిధి ఎక్కువ కావడంతో ప్రస్తుతం ఉన్న భవనం కూడా చిన్నదిగా ఉందని, ప్రభుత్వం మరోచోట స్థల పరిశీలన చేసి అనువైన విశాల పశు వైద్య కేంద్రం నిర్మించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాదును వివరణ కోరగా భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. తాత్కాలికంగా మరమ్మతులైనా చేపట్టాలని ప్రజాప్రతినిధులకు విన్నవించామన్నారు.

### నేడు, రేపు అగ్రిగోల్డ్ బాధితుల

## 30 గంటల ధర్మాగ్రహ దీక్షలు

**ప్రజాశక్తి -అనకాపల్లి** : తాము కట్టిన డిపాజిట్లు ఇప్పించి, కంపెనీ యాజమాన్యాన్ని శిక్షించాలని, బాధితుల ఆక్రందనలు గుర్తించాలని కోరుతూ స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో అగ్రిగోల్డ్ బాధితుల 30 గంటల ధర్మాగ్రహ నిరాహార దీక్షలు నిర్వహించినట్లు అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వైయన్ భద్రం తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో జరిగే ఈ ధర్మాగ్రహ నిరాహార దీక్షల అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న రూ. పది వేలు, రూ.20వేల డిపాజిట్ దారులందరికీ డిసెంబర్ 31 లోగా చెల్లింపులు జరపాలని కోరారు. డిపాజిట్‌దారుల సొమ్ముతో సంస్థలో పొలాలు, స్థలాలు కొన్నవారికి స్వాధీన పరచాలని, అగ్రిగోల్డ్ యాజమాన్యం, బినామీల వ్యక్తిగత ఆస్తులను జప్తు చేయాలని, సంస్థ ఆస్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఆత్మహత్యలు, అసహజ మరణం పొందిన డిపాజిట్‌దారులు, ఏజెంట్ల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొవాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు దేవరాపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

**ప్రజాశక్తి-దేవరాపల్లి** : వచ్చే నెల 8,9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం బి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 26న కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతీయ విజ్ఞానమండలి, ఆంధ్ర ప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా 8,9,10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి పోస్టల్ కాంపిటేషన్ పోటీల్లో దేవరాపల్లి విద్యార్థులు పి. రజిత జనరల్ థీమ్ విభాగంలో ద్వితీయ బహుమతి, ఆజాదీకా అమత్ మహోత్సవ విభాగంలో పి. జలహాసిని ద్వితీయ బహుమతిని గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు రూ.రెండు వేల నగదు బహుమతి, సర్టిఫికేట్, మెమొంటోలు అందజేశారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు యు.శ్రీనివాసరావు, ఆర్ట్స్ టీచర్ సాగర్‌లను హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## 103 మందికి కంటి పరీక్షలు



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : మండలంలోని చౌడువాడ ప్రాథమిక పాఠశాల వద్ద శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ప్రారంభించారు. చౌడువాడ, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 103 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏరుకునాయుడు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ యాజమాన్యం తరచూ ఇటువంటి కంటి వైద్యశిబిరాలను నిర్వహించి పేదలకు ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, డాక్టర్ వి. సురేష్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ విజయ. శంకర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకు పాలన

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:** సచివాలయ వ్యవస్థ ద్వారా సిఎం జగన్ పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం మండలంలోని ఎం భూపతిపాలెం, చిన మళ్లాంలలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణంతోపాటు పలువురు వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. జెడ్‌పిటిసి దొండా రాంబాబు, వైసిపి నేత అచ్చంనాయుడు, సర్పంచ్ బర్ల శివ పాల్గొన్నారు.



గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మ శ్రీ

## పేదలకు బియ్యం, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, బియ్యం పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

**ప్రజాశక్తి - కశింకోట** :మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలలో భాగంగా మూడవ రోజు ఆదివారం అడ్డాం గ్రామంలో పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణామూర్తి, కలగా సోమేశ్వరరావు, ఉల్లింగల రమేష్, జెర్రపోతుల నూకునాయుడు, గొంతిని గంగాధర్, మాజీ సర్పంచ్ రెడ్డి కన్నబాబు, ఒమ్మి శ్రీను, వైస్ ప్రెసిడెంట్ కష్ణంరాజు, గుంటూరు మనిరాజు, బుదిరెడ్డి చిట్టిబాబు, గుంటూరు నారాయణరాజు, రాజా, వెంకటపతి పాల్గొన్నారు.

## పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న దేవాంగ సంఘ నేతలు

**ప్రజాశక్తి-చోడవరం** : మండలంలో వెంకన్న పాలెం సాయిబాబా గుడి వద్ద ఆదివారం మండలంలోని పది గ్రామాలకు చెందిన దేవాంగ సంక్షేమ సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఎంఆర్ గ్రూపు గాజువాక యూనిట్ అధినేత ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ దేవాంగ సోదరులందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి అందరం సంఘటితంగా సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు.

## డేటా ఎంట్రీపై అవగాహన

**ప్రజాశక్తి- కశింకోట** : ధాన్యం కొనుగోలు డేటా ఎంట్రీపై రైతు భరోసా కేంద్రంలో అవగాహన ఆదివారం కల్పించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో, స్థానిక పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో కంప్యూటర్ ద్వారా ధాన్యం విక్రయించే రైతులు ఎంట్రీ నమోదు, ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎఇఒ ఆళ్ళ నూక శ్రీనివాసరావు, పి.ప్రవీణ, డి.రేవతి, టెక్నికల్ అసిస్టెంట్ వై.లక్ష్మణరావు, డి నూకేష్, ఇ సాయినాథ్ పాల్గొన్నారు

## గ్రంథాలయానికి రండి!



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : సెలవురోజుల్లో, ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలను సందర్శించి, వివిధ పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అచ్యుతాపురం గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు కోరారు. ఆదివారం గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహించి, విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. వారం రోజులపాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతోపాటుగా గ్రంథాలయాలలో వివిధ పుస్తకాలు చదవడం ద్వారా లోకజ్ఞానం, విజ్ఞానం పెరిగి పోటీ పరీక్షలలో రాణించడానికి వీలుంటుందన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి నచ్చిన పుస్తకాలను చదవాలన్నారు.

## ఎన్‌సిసి క్యాడెట్ల సేవలు అభినందనీయం



ఎఎంఎఎల్ కాలేజీలో ఎన్‌సిసి దినోత్సవం

**ప్రజాశక్తి- అనకాపల్లి** : ఎఎంఎఎల్ కళాశాల ఎన్‌సిసి విభాగం సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఇచ్ఛా ఫౌండేషన్ నిర్వాహకురాలు మధు అన్నారు. ఆదివారం కళాశాలలో ఎన్‌సిసి 75వ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్ల మధ్య క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

అలాగే ఇచ్ఛా ఫౌండేషన్ ద్వారా అనాథ పిల్లలకు దుప్పట్లు, పాలు, రొట్టెలు, నాప్‌కిన్స్, ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ జగదీష్, లెఫ్టినెంట్ ఎఎస్ఎస్. మూర్తి, 86 మంది ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

**కశింకోట** : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌సిసి పతాకాన్ని ఆవిష్కరించిన ప్రిన్సిపల్ మహేష్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఆత్మ గౌరవం, దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. ఎన్‌సిసి నైపుణ్యంతో భవిష్యత్తులో రూపురేఖలు మారిపోతాయన్నారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌ఛార్జి రూపానంద్, సహోద్యాపాయులు పాల్గొన్నారు.

# నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణాలు

- ◆కాలనీ దూరం కావడంతో ఆసక్తి చూపని అన్నవరం లబ్ధిదారులు
- ◆గుడ్డిపలో కానరాని విద్యుత్, తాగునీటి సదుపాయాలు
- ◆ జనరేటర్‌తోనే చేపడుతున్న గృహాల నిర్మాణ పనులు

**ప్రజాశక్తి-రావికమతం** :మండలంలో గుడ్డిప జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగనన్న కాలనీలో లే అవుట్‌లు వేసిన వెంటనే మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశించినప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో లబ్ధిదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జగనన్న కాలనీలో రోడ్లు, నీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం, బడి, గుడి ,లైబ్రరీ తదితర సౌకర్యాలతో కూడిన కాలనీగా తయారు చేయాలన్నదే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్ట లేదు. ఈ కాలనీలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయలేదు. అలాగే రక్షిత తాగునీటి పథకం కూడా లేదు. రహదారి సౌకర్యం లేక పోవడంతో ఇళ్లకు మెటీరియల్ తెచ్చుకునేందుకు లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో జనరేటర్‌లను అద్దెకు తెచ్చు కుంటున్నారు. దీంతో, మరింత ఆర్థిక భారంగా మారుతుంది. జనరేటర్లు తెప్పించుకొని ఇంటి పనులను చేసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం ఇంటికి ఇచ్చిన బిల్లు కంటే మూడు రెట్లు ఖర్చు ఎక్కువ అవుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు జగనన్న కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని కోరుచున్నారు.

**కోటవురట్ల:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్మించ తలపెట్టిన జగనన్న కాలనీ ఇళ్ళ నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయి. ప్రధానంగా అన్నవరం గ్రామానికి సంబంధించి కాలనీ ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.20 లక్షలతో స్థలం కొనుగోలు చేసి లబ్ధిదారులకు కేటాయించింది. అయినా ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాక పోవడంతో అధికారులకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఇల్లు నిర్మించుకునేందుకు దాదాపు 50 మంది వరకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. గ్రామానికి ఇది దూరంగా ఉండడంతో లబ్ధిదారులు నిరాకరిస్తున్నారు. ఈ లే అవుట్ కోసం సుమారు నాలుగు లక్షలతో కరెంటు లైన్, బోరు అదేవిధంగా రోడ్లు నిర్మాణం కోసం ప్రభుత్వం ఖర్చు చేసింది. నిర్మాణాలు చేపట్టాలని అధికారులు పలుమార్లు గ్రామ సభ నిర్వహించినా లబ్ధిదారులు ముందుకు రాకపోవడం పట్ల ఏమి చేయాలని అధికారులు డోలాయమానంలో పడ్డారు.



గుడ్డిపలో పనులు చేసేందుకు జనరేటర్‌ను తీసుకొచ్చిన లబ్ధిదారులు



కాలనీలో బిగించి వదిలేసిన మోటార్

# మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

**సిపిఎం నేత అప్పలరాజు**

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. హెటిరో పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహాధర్నా ఆదివారం నాటికి 361వ రోజుకు చేరింది.పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు అప్పలరాజు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెటిరో వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 361 రోజుల నుండి పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు ధర్నా చేస్తున్నప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమన్నారు.ఈ ప్రాంతంలో వేట సాగక పోవడంతో మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస పోవడం జరుగుతుందన్నారు.మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తులో కూడా కొత్త పైపులైనుకు అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. కంపెనీ వేసిన కొత్త పైప్ లైన్ పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార జెఎసి ప్రధాన కార్యదర్శి వాసిపిల్లి నూకరాజు, సిపిఎం మండల కార్యదర్శి సిపిఎం రాజేష్, మత్స్యకార నాయకులు పిక్కి గంగరాజు, గోసల స్వామి, దైలపల్లి శ్రీను, యుజ్జల అప్పలరాజు, చేపల సోమేష్, కారే కోదండరావు, చొక్కా గోపి, మైలుపల్లి బాబ్జి, మైలపల్లి శివాజీ, గోసల అంజి, దైలపల్లి ఆనంద్ కుమార్, గోసల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, అప్పలరాజు

# అయ్యప్ప భక్తులకు తప్పిన పెను ప్రమాదం

- ◆ ఒంగోలులో ప్రమాదానికి గురైన బస్సు
- ◆20 మందికి గాయాలు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలో డిఎల్ పురం, నెల్లిపూడిలో, గునిపూడి గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వామి దీక్షాపరులు బస్సు ప్రమాదంలో గాయాలతో బయట పడ్డారు. ఈ గ్రామాలకు చెందిన చెందిన అయ్యప్పస్వామి దీక్షాపరులు శనివారం ఒక ప్రైవేటు ట్రావెల్‌లో శబరిమలై వెళ్తుండగా వీరి ప్రయాణిస్తున్న బస్సు ఒంగోలు వద్ద ప్రమాదానికి గురైంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అయ్యప్ప దీక్షాపరులు ప్రయాణిస్తున్న బస్సు ఒంగోలు వైద్య కళాశాల సమీపాన లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ బస్సులో 44 మంది అయ్యప్ప స్వామి దీక్షాపరులు ఉండగా వారిలో సుమారు 20 మంది స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వీరిలో నలుగురికి మాత్రం తీవ్ర గాయాలు అయ్యాయని అక్కడ చికిత్స పొందుతున్న డీఎల్ పురం గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షాపరులు స్థానిక విలేకరులకు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు ఒంగోలు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. గాయపడిన వారిలో జి కనకారావు, జి.నానాజీ, కే.శ్రీను, ఎ.అప్పలరాజు, జి శ్రీను, జి.గోవిందు ,జి.మంగ, జి.వెంకటలక్ష్మి, కాంతం, ఏ.నాగరత్నం, అనసూయ డి.హరి, కె.అప్పలకొండ జి సత్యనారాయణ, కే.గణేష్, డి.నరేష్ ఉన్నారు. ఎవరికీ ప్రాణహాని లేక పోవడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.



నుజ్జునుజ్జయిన బస్ ఇదే..



చికిత్స పొందుతున్న బాధితుడు



నివాళి అర్పిస్తున్న అభిమానులు

## సినీ నటుడు కృష్ణకు నివాళి

**ప్రజాశక్తి-మాడుగుల:** కీర్తిశేషులు, సినీ నటుడు కృష్ణకు అభిమానులు ఘనంగా నివాళి అర్పించారు సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల ఆయన అభిమానులు మాడుగుల గ్రామంలో సంతాపం ప్రకటించారు. స్థానిక సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సేవ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం కృష్ణ సినీ గీతాలతో నటించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు గౌరీ పట్టపు జగన్నాథరావు , పెరుమా ళ్ళ వెంకటరావు, రాఖిశ్రీను, ఎన్‌వి రమణ, రాంబో అప్పారావు, ఎడ్ల వెంకటేష్, మామిడి కృష్ణ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్

## ధాన్యం కొనుగోలుపై అవగాహన

**ప్రజాశక్తి-చీడికాడ:**ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సిబ్బందికి మండలం కేంద్రంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఆపరేటర్లకు మండల వ్యవసాయ అధికారి వీఆర్‌ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతులు కచ్చితంగా పాటించాలని సూచించారు. రైతులు ధాన్యం అమ్మేటప్పుడు వ్యర్థ పదార్థాలు తక్కువ శాతం ఉండేటట్టు చూసుకోవాలని శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ రమేష్, పిఎసిఎస్ సీఈవో మజ్జి వరహాలదొర, సిబ్బంది వరహాలమ్మ, మహాలక్ష్మి, సురవరం పిఎసిఎస్ సిబ్బంది అప్పలనాయుడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతుకు నోచుకోని బోరు

## తాగునీటికి అవస్థలు

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండలంలో కొడవటిపూడి ఎస్సీ కాలనీ వద్ద అంగన్వాడి కేంద్ర వద్ద తాగునీటి బోరు చాలాకాలం నుండి పని చేయక పోవడంతో అంగన్వాడి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఈ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టక పోవడంతో తరచూ అందరూ వినియోగించడంతో ఈ బోరు మరమ్మతుకు గురవుతోంది. ప్రస్తుతం పంచాయతీ కుళాయి నుంచి నీటిని తీసుకువచ్చి సిబ్బంది వినియోగిస్తున్నారు. అధికారులు బోరు మరమ్మత్తు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## టిడిపి నేతలకు పరామర్శ

**ప్రజాశక్తి -కొత్తకోట:**రావికమతం మండలం కొత్తకోట లో ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందిన కొత్తకోట మాజీ ఎంపిటిసి కూరాకుల బాబ్జి, గత ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన టిడిపి కార్యకర్త బొట్టా లింగరాజులను చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ఎన్ఎస్ రాజు, చోడవరం టిడిపి ఇన్చార్జ్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. మరుపాక ఎంపిటిసి సూర్యానారా యణను కూడా ఆయన స్వగ్రామం గొల్లలపాలెం వెళ్లి పరామర్శ చేశారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, బెన్నవరం మాజీ సర్పంచ్ కర్రీ అర్జున, కొత్తకోట టిడిపి నాయకులు కోట సత్తిబాబు, ఉగ్గిన శ్రీను, గర్రెడ్డి శ్రీను, చేపూరి శ్రీను, బి. సత్తిబాబు తదితరులు ఉన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న సిఐ

## శ్రీ ప్రకాష్‌లో ఎన్‌సిసి డే

ప్రజాశక్తి -పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధం సంస్థ డిగ్రీ కాలేజ్‌లో ఎన్‌సిసి డే ఉత్సవాలను ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట సిఐ అప్పలరాజు ఎన్సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్సీసీ విద్యార్థుల్లో పూర్తిస్థాయి క్రమశిక్షణ ఉంటుందని, కాలేజీ దశలో ఎన్సిసి వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీర్రాజు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

## వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నుండి వైసిపికి భారీ వలసలు మొదలయ్యాయి మాకవరపాలెం మండలం ఎంపీపీ రుత్తల సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ పార్టీని వీడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలపరుస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వైసిపి పార్టీలో చేరిన అందరికీ స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ వైయస్సార్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా రంజక పాలనకు ఆకర్షితులై వైసీపీలో చేరుతున్నట్లు మాకవరపాలెం మండలం బయ్యవరం గ్రామానికి చెందిన నేతలు తెలిపారు. మెడికల్ కాలేజీని తమ మండలానికి తీసుకు రావడంతో వైసీపీకి చేరామన్నారు. ఇప్పటికే గొలుగొండ, నర్సీపట్నం మండలాలు, ఇప్పుడు మాకవరపాలెం మండలం లో పలు గ్రామాల నుండి తెలుగుదేశం కార్యకర్తలు వైసీపీ పార్టీలోకి చేరడం విశేషం.



పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

## రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలోని జైతవరం నుండి బైలపూడి వయా దిబ్బపాలెంకు సుమారుగా 2.8 కిలోమీటర్ల మేర రూ.76 లక్షల నిధులతో నూతనంగా తారురోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ఎంపీపీ కురచా జయంవన్నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కృషి మేరకు మండలంలోని పాడైపోయిన రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, యువజన విభాగం అధ్యక్షులు గొల్లవిల్లి స్వామినాయుడు, విశాఖ డైరీ డైరెక్టర్ సూర్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు రమణబాబు, నాయకులు సుంకర శ్రీను, కురచా కుమారి, శేషు, చైతన్య, మచ్చిరాజు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ వీధిలో గంజాయి మత్తుబాబుల వీరంగం

**కౌన్సిలర్, స్థానికుల ఫిర్యాదు ▶▶ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసాధికారులు**

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక బ్రాహ్మణ వీధిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ యువత గంజాయి మత్తులో వీరంగం సృష్టించారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో మత్తులో ఊగుతున్న యువత స్థానిక నివాసులపై రాళ్ళు రువ్వడం, కండోమ్ ప్యాకెట్లు విసరడం వంటి దశ్చర్యలకు పాల్పడటంతో స్థానికులు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధుకు తెలియజేశారు. దీంతో, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సదరు ఇంటిని చేరుకునే సరికి ఆ యువకులు తప్పించుకు పారి పోయారు. కౌన్సిలర్ మధు ఆధ్వర్యంలో టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సైలు గోవిందరావు, ధనుంజయనాయుడు యువకులు ఉంటున్న గదిని పరిశీలించారు. ఆ గదిలో సిగరెట్టు పీకలు,



ఆందోళనలో స్థానికులు



ఇంట్లోని గదిలో తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ

గంజాయి, డ్రింక్ బాటిల్స్, కండోమ్ ప్యాకెట్లు ఇతరత్రా బయటపడ్డాయి. దీంతో పోలీసులు స్థానికులను విచారణ చేయగా ఇక్కడ ఇటువంటి కార్యకలాపాలు ఎప్పటినుంచో జరుగుతు న్నాయని ఇంటి ఓనర్ కు తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. చదువుకుంటున్న విద్యార్థులు కావడంతో రూమ్ అద్దెకిచ్చినట్లు ఇంటి ఓనరు తెలిపాడు. దీనిపై పూర్తిగా పరిశీలన చేసి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వ్యక్తులను వదిలిపెట్టమని, వీరిపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోవిందరావు, ధనుంజయ్ నాయుడు తెలిపారు.

**భయాందోళనలో స్థానిక ప్రజలు**

ఆరు సంవత్సరాల బాలికపై గంజాయి మత్తులో అత్యాచారానికి ఒడిగట్టిన సంఘటన మరవక ముందే ఇటువంటి సంఘటనలు చూసి పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సంఘ విద్రోహ కార్యకలాపాలకు నిలయంగా నర్సీపట్నం మారిపోతుందని విమర్శలు వినబడుతున్నాయి. అధికారులకు ఇసుమంతైన చలనం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

# మహిళలకు రాందేవ్ బాబా క్షమాపణ చెప్పాలి

**ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి**

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మహిళలపై రామ్ దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్త్రీలకు క్షమాపణ చెప్పాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. అరకువేలి యండపల్లివలస గురుకుల మహిళ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై విద్యార్థులతో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, స్త్రీలు ఎక్కడ గౌరవించబడతమో అక్కడే దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెప్పున్నప్పటికీ మరోవైపు ప్రముఖులు అను కునేవారే స్త్రీల వస్త్రధారణ పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.ఇటీవల గరికిపాటి నరసింగరావు స్త్రీల వస్త్ర ధారణపై అసభ్యకరంగా చేసిన వ్యాఖ్యలు మరవక ముందే, మరోవైపు రామ్ దేవ్ బాబా స్త్రీలు విప్పుకున్నా అందంగానే ఉంటారని అసభ్యకర వ్యాఖ్యలు చేయడం స్త్రీ జాతిని అవమానించడమేనని ఆమె మండిపడ్డారు. స్త్రీలకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. దేశంలో ప్రజలు ఆకలి, నిరుద్యోగం వంటి అనేక రకాల సమస్యలతో సతమతమవుతుంటే వీరికి ఇవేమి పట్ట లేదన్నారు. రామ్ దేవ్ బాబాపై వెంటనే చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ, వార్డెన్ సత్యవతి, మహిళా మండల నాయకులు సన్యాసమ్మ, పిడి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థినులు



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి.

## దట్టంగా మంచు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా గడిచిన రెండు రోజులుగా దట్టంగా పొగ మంచు కురుస్తోంది. ప్రధానంగా రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఆటంకం కావడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కురుస్తున్న పొగ మంచు కారణంగా వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మార్నింగ్ వాకర్స్ సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం 8 గంటలు కావస్తున్నా సూర్యోదయం కాక పోవడంతో మైదాన ప్రాంతాల్లో చలి గజగజ వణికిస్తుంది.



మంచులో వెళుతున్న వాహనదారులు

## రామన్నపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో రామన్నపాలెం గ్రామంలో ఓమ్ని, గిగిల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యం శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో నెప్రాలజీ, చిన్న పిల్లలకు గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత శిబిరానికి. సుమారు 220 మంది హాజరు అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్పు, వైస్ ఎంపీపీ రాజారావు, టిడిపి నాయకులు. కొండ్రపు అప్పలనాయుడు, వైద్య సిబ్బంది నాయుడు, ప్రవల్లిక పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

## పంపిణీ కాని ఉచిత బియ్యం

ప్రజాశక్తి -రావికమతం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం నేటికీ అందకపోవడంతో లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 52 రేషన్ డిపోలకు గాను 27 డిపోలకు మాత్రమే ఈ ఉచిత బియ్యం సరుకులను అందించారు. మిగిలిన 25 రేషన్ డిపోలకు ఉచిత సరుకులు అందవలసి ఉంది. రేషన్ బియ్యం తోనే జీవించే అనేక మంది పేద ప్రజలు పస్తులతో అలమటిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చే బియ్యాన్ని సకాలంలో అందించకపోవడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో రేషన్ బియ్యం అందించాలని మండల ప్రజలు కోరుచున్నారు.

